# "ఆడువారి మాటలకు అర్థాలు వేరులే!"

రచన: "బాపు"

త్రొను యింటికివస్తే లేడిపిల్లలా చెంగున దొడ్డి దారిన ముఖం కప్పుకొనిపారిపోయే లక్ష్మి ఆనందరావు ఆఫీసుకు పోయేటప్పుడు, మరలి వచ్చేటప్పుడు, రెప్పవాల్చకుండా, కిటికీ చువ్వలగుండా, తనకేసి ఎందుకలా చూస్తుంటుందో, ఆనందరావుకు అర్థం కాకుండా ఉండిపోయిన సమస్యలలో అదొకటి.

ప్రతినిత్యమూ, ఆనందరావు యింట్లో ఉండనిసమయాల్లో పొరిగింటిలక్ష్మి, ఆనందరావుయింట్లోనే కాలక్షేపం చేస్తూంటుంది. కారణం యేమైనా, ఆనందంభార్య సరోజ వాత్సల్యం, ఆనందరావు పుస్తకాలబీరువా లక్ష్మిని ఆకర్షించి ఉంటాయనడం సమంజసం కాకపోదు.

లక్ష్మి చదువుకున్న పిల్లేమో అందానికి తగ్గట్టు అలంకరణచేసుకొని, అమాయకుడైన ఆనందాన్ని సైతం ముగ్ధుణ్ణిచేస్తూంటుందనడం వింతకూడా కాదు.

"అస్తమానం ఆనందంగారింట్లోనే కేట్టాడకపోతే, కాస్తపని సాయంచేయరాదుటే" అని తల్లి రంగమ్మ కూతుర్ని కేకవేయడం—

"పోనీలేవే! ఇప్పటినుండీ దానినెందుకు బాధపెడతావ్? అత్తారింటికిపోతే, ఎల్లాగూ తప్పదు – ఉన్న నాలుగురోజులైనా కాస్త కుషీగా ఉండనీయ్" అని తండ్రి రామయ్య రంగమ్మను మందలించడం, తండ్రి ఆసరాతో లక్ష్మి ఆడింది ఆటగా, పాడింది పాటగా చెల్లించుకుంటూ, తనయింట్లో ఏ విషయమూ పట్టించుకొనకపోవడం ఆ కుటుంబంలో అలవాటయిపోయింది.

ఆనందరావుగారింట్లోనైనా లక్ష్మి ప్రతి పనిలోనూ, సరోజకు చేదోడు, వాదోడుగా ఉంటూండేది. నిజానికి సరోజ, లక్ష్మి సయాన అప్పచెల్లెళ్ళేమో అనుకొనేవారు చాలామంది. ఆనందరావు ఎంత యోగ్యుడైనా, లోకానికి జడిసి, నిండుయవ్వనంలో ఉన్న తనకూతురు లక్ష్మి అనునిత్యం పొరిగింటి ఆనందంగారింటికి పోతూండడం, రంగమ్మకు కాస్త కష్టంగానే వుండేది. కాని భర్తకు జడిసి, కూతురుగూర్చి ఏమీ అనలేకపోయేది.

అవును మరి, ఎంత చదువుకుంటేమాత్రం, యవ్వనంలోవుండి పెండ్లియీడుకు వచ్చిన అమ్మాయి, ఇరుగు పొరుగు యిళ్ళల్లో అదే పనిగా కాలంగడపడం ఏతల్లిచూచి సహించగలదు? స్వేచ్ఛకు, స్వాతంత్ర్యానికి, కొన్ని హద్దులంటూ ఉన్నాయామరి? స్నేహం చనువుగా మారి, చనువు ప్రణయానికి దారితీసి, పెదదారులుత్రొక్కితే నిందితులు యెవరౌతారు? పిమ్మట తలయెత్తుక ఎలాతిరుగుతారు? రంగమ్మకు ఇదే భయం.

లక్ష్మిఅయినా కాస్త చదువుకున్నది గదా? హద్దుమీరి ప్రవర్తించకుండాఉండాలా మరి? సరోజదగ్గర చనువు ఆధారంగా ఆనందంగారింట్లో వంటచేయడం బీరువాపుస్తకాలు సర్దిపెట్టడం "ఏ సామాను ఎక్కడ పెడితే అందమో నీకు తెలీదంటూ" వంటపాత్రలు మొదలు డ్రాయింగ్‌రూమ్‌వరకూ, నూతనఫక్కీలో అలంకరణచేయడం ఇల్లాఒక్కక్షణం తీరికగా పోనిచ్చేది కాదు.

అయినా ఆనందరావు వస్తున్నట్లు సవ్వడి వింటో ఒక్కదాటున, యింటిముఖంపట్టేది. తాను పెట్టినసామాను, స్థానాలుకదలి క్రొత్తస్థలాలు ఆక్రమించడంతో, ఆనందరావు గాభరాపడడం "అదంతా మీ మరదలు లక్ష్మి ప్రతాపమండీ" అని ఆరోజు లక్ష్మి చేసినపనులూ తనకు చేతకాదని, చేసిన వ్యాఖ్యానాలు అన్నీ పూసగుచ్చినట్టు సరోజ చెప్పడం, దాంతో భార్యా భర్త లిద్దరూ నవ్వుకోడం పరిపాటయింది. ఈ సంభాషణంతా గోడచాటునుండి లక్ష్మి విని, మరల అవకాశం దొరికినపుడు, సరోజకు చెప్పి, "నీపని పడతానుండు" అని వేళాకోళం చేయడం లక్ష్మికి దినచర్యలో ఓ భాగం అయింది.

* * *

ఆనందరావు చిన్నవయస్కుడే అయినా, విద్యావంతుడవడంవల్ల బాధ్యతగల పెద్ద ఉద్యోగమే నిర్వహిస్తున్నాడు. వారానికి మూడు దినాలు కేంపుకు వెళ్ళక తప్పేది కాదు.

ఆనాడు ఆదివారం మూడు దినాలవరకూ రానని, ఇంట్లో జాగ్రత్త చెప్పి కేంపుకు పోయాడు. యీ అదనుకోసమే చూస్తున్న లక్ష్మి పరిగెత్తుకుంటూ వచ్చి, "సరోజా! బావగారి బాధ వదిలింది కాబట్టి, ఈమూడు దినాలు నే చెప్పినట్లు వినితీరాలని" విరగబడినవ్వుతూ, బీరువాలోని పుస్తకాలన్నీ బయటపడేసి, ఒక్కటొక్కటే తనకు నచ్చిన ప్రకారం సర్దడం మొదలుపెట్టింది. గోడలకున్న పటాలు ఇక్కడి దక్కడ, అక్కడిది ఇక్కడకు మార్చడం, డ్రాయింగ్ రూము సామాను సర్దడం, ఇలా గృహాలంకరణతో ఓరోజు గడిచిందో లేదో – ఆనందం అనుకున్నదానికంటే ఓ రోజు ముందు వచ్చేడు. ఆ సమయానికి లక్ష్మి ఆనందం ఆఫీసుఫైల్సుపై దుమ్ముదులుపుతూ—"ఆడవారిమాటలకు అర్థాలు వేరులే" అన్న "మిస్సమ్మ"లోని పాట శ్రావ్యకంఠంతో పాడుతోంది. వెనకపాటుగా నిలుచొని ఉన్నాడేమో ఆనందం లక్ష్మి గుర్తించలేదు.

టేబిలుమీద విరజల్లినట్లుండే ఉత్తరాలను సర్దుతూ – "సరోజా! చూసావా? బావగారి నిర్లక్ష్యం? పత్రికవాళ్ళు పంపిన చెక్కు ఎలా పడేసారో? కాస్తంత బాధ్యతలు నచ్చచెప్పవమ్మా ... నువ్వు కాబట్టి, యిలా పడేసి పోయినా, ఊరుకొనగల్గావేమో కాని, నేనే

అయితేనా చెవులు నులిమి చేతిలో పెట్టే దాన్ని” అంటూ గదిద్వారంవద్ద నిలుచున్న ఆనందాన్ని సరోజగా భావించిన, లక్ష్మి సరోజనుండి ఎంతకూ సమాధానం రాని కారణాన్న “పోనీవమ్మా ఆఫీసరు భార్యనుకదా అని గొప్పపడ్తున్నావు. అడిగినదానికి సమాధానం చెప్పటానికికూడా ఇంతఅతిశయమా!” అని వెనక్కు తిరిగి ఆనందాన్ని చూచి, లక్ష్మి



సాలంక్కరచుకోనడమూ, బీరువా చాటుకు వెళ్ళి దాగోనడమూ ఒక్కసారి జరిగినై!

“కానీవమ్మా! మరదలా! పాటలోఇంకా రెండు చరణాలు ఉంచేసావు. అదికూడా వినిపించి, ఆ కాగితాలన్నీ సరిగా సర్దిపెట్టు బావగారిచ్చే బహుమతి స్వీకరిద్దువు గాని” అని ఆనందమనేసరికి అప్పుడే గదిలోనికివస్తున్న సరోజ నవ్వుతూ లక్ష్మి ముసి ముసి నవ్వులు కలసి ప్రతిధ్వనించినై.

“ఏమిటండీ! అసలే మిమ్మల్ని చూస్తే అదరిపోతుంది. ఆ పిల్లతో పరిహాసాలాడతారనీ” అన్న సరోజమందలింపువిని, ఆమె చాటుకువెళ్ళి లక్ష్మి “బారి యివ్వమసమ్మా యింటికి పోతాను” అంది.

“ఏమిటీ? నన్ను చూసి బెదరిపోవడమెందుకూ? నేను దయ్యాన్ని భూతాన్ని కానే” అంటూ చేతిలోవున్న రెండు సిల్కు చీరలుతీసి “ఇది నీకూ, ఇది మామరదలకూ” అంటూ సరోజకు యిచ్చేసాడు.

“ఇందమ్మా! ఇంతవరకూ కష్టపడిన నీకు బావగారు తెగించి బహుమతి యిస్తున్నారు”

అని సరోజ అనేసరికి లక్ష్మి “పో పో! నీకు వేళాకోళాలికి హద్దూ పద్దూ లేద”ంటూ గిరుక్కున లేడిపిల్లలా ఇంటివైపుకు పారిపోయింది.

తనింట్లో అంత చనువుగా, లక్ష్మి ప్రవర్తించడానికి కారణమూ తాను అభిమానంతో యిచ్చిన కానుకను తృణీకరించడమూ చూసిన ఆనందానికి ఏమీ పాలుపోలేదు.

* * *

మర్నాడు ఆనందం ఆఫీసునుండి యింటికి వస్తుంటే, ఆనందం చూడాలన్నట్లు, అతడిచ్చిన సిల్కుచీరకట్టుకొని, మేడమీద నిలుచుని ఉండడం ఆనందం గుర్తించి “సిల్కు చీర లక్ష్మికి యిచ్చేలావా” అని సరోజను అడిగాడు.

“ఆనాడే ఆ చీర యిచ్చేవరకూ, అల్లరిచేసి పట్టుకపోయింది” అని సరోజ చెప్పడంతో, ఆనందరావు ఆశ్చర్యంతోపాటు, అయోమయస్థితిలోపడ్డాడు. తాను హృదయపూర్వకంగా యిచ్చినప్పుడు తిరస్కరించడం ఆ పిమ్మట తనంతట తాను, చీర తీసుకపోవడంతో ఆనందానికి లక్ష్మి మానసికతత్వం అర్థంకావడంలేదు. తాను, యింటికొచ్చే సరికల్లా అరక్షణం నిలువకుండా, చెంగున యింటికి పరుగుతీసే లక్ష్మి, తాను ఆఫీసుకు పోయేటప్పుడు, ఆఫీసునుండి వచ్చేటప్పుడు, తనవైపే రెప్పవాల్చకుండా ఎందుకలా చూస్తుంది? ఆమె తదేకదృష్టికి, ఆనందరావే సిగ్గుపడి తలవంచుకొనే చిత్రాలు నిత్యమూ జరుగుతున్నవే......

అసలు లక్ష్మికి తనంటే ఎలాంటి అభిప్రాయం ఉందో? ఆమెకంటికి ఆనందరావు ఎదురుగా సింహంలా దూరంలో అందకాడుగా కన్పిస్తుంటాడా? తనింట్లో ఆమె తనవైపయినా చూడదే! అల్లంతదూరాన, ఆఫీసునుండి తిరిగివచ్చేవేళ కాచుకూర్చున్నట్లు తప్పనిసరిగా, ఆ కిటికీచువ్వలవద్దనో, మైడాబామీదనో తనకు ప్రత్యక్షమౌతూండడం ప్రతిదినం జరుగుతున్నదే! బహుశా లక్ష్మి—సరోజ అసూయపడుతుందేమో నని తనింట్లో అలా ప్రవర్తిస్తూండొచ్చు. అంతే అయివుంటుంది, లక్ష్మికి నిజంగా తన

ప్రేమ ఉండివుంటుంది. లేకుంటే "నీవు అమాయకురాలవై బావగార్ని అదుపులో పెట్టలేకపోయావు కాని, నేనే అయితేనా? అని లక్ష్మి ఎందుకంటుంది? ఆఫీసుబంట్రోతు అప్పన్నకూడా ఇదే విషయం చెప్పడం ఎన్నోసార్లు విన్నాడు. సందేహం లేదు. నిజంగా లక్ష్మికి తనపై ప్రేమవుంది. అంటే లక్ష్మికి వేరే దురుద్దేశం... ఛా! చిలిపితనానికి అలా అంటోందేమో కాని, తాను అలా భావించకూడదు. పెండ్లికానిపిల్ల. తాను ఇలాటి దురుద్దేశాలు, ముఖ్యంగా తనింట్లో చనువుగా తన్నుగూర్చి, తన సామానుగూర్చి సరోజకంటే హెచ్చుశ్రద్ధతీసుకొని, ఏపూట కాపూట, తన గృహాన్ని నిత్యసుందరంగా అలంకరించే తతంగంలో సతమతమౌతూన్న లక్ష్మిగూర్చి, తాను కృతజ్ఞత చూపటానికి బదులు ఆవిధంగా తలపోయడం తప్పేమో అనుకున్నాడు. అయినా లక్ష్మికోరిక అదే అయితే తన కృతజ్ఞతకు ఫలితంగా, ఆమె కోరిక చెల్లించాల్సిందే కదా! లేకుంటే తనకు మగతనం లేదని భావిస్తుందేమో? పైపెచ్చు కోపంతెచ్చుకుని, తనింటికి ఇక రాకుండా వుండి, తనకోర్కె యీడేరలేదన్న దిగులుతో తనపై అభాండాలువేసి తన్ను రచ్చకెక్కిస్తే? తనమాట నమ్మేవారెవరు? స్త్రీ మాటకుండే విలువ, పటుత్వం — పురుషులవిషయంలో ఎంత నిజాయితీగావున్నా లెక్కకు రాదన్నది తనకు అనుభవసిద్ధమే కదా! తాను ఎంత యోగ్యుడని, ఉత్తముడని, లోకులు భావిస్తే మాత్రం లక్ష్మి కథ అడ్డంగా మారిస్తే తాను అప్రతిష్ఠపాలు కాక తప్పదు. కనుక, లక్ష్మి కోసరం తన నిజాయితీని, ఆశయాల్ని వదులుకోక తప్పదు. ఎంత త్యాగమైనా చేసితీరాల్సిందే! లక్ష్మి ఒంటరిగా కలిసేటట్లు చేసుకొని, తన సంశయాన్ని తీర్చుకొని, లక్ష్మి కోరిక చెల్లించాల్సిందే!" ఆలోచనా ప్రవాహంనుండి ఒక నిర్ణయంతో ఒడ్డుచేరుకోగల్గాడు ఆనందరావు.

* * *

ఆనందరావు యింతవరకూ పరాయిస్త్రీని కన్నెత్తిచూసాడని చెప్పేందుకు కూడా వీలు లేదు. తన డ్యూటీయేమో అంతే! తీరుబడి ఉంటే ఏవయినా కథలు రాసుకుంటాడు. అందుకే ఆనందాన్నిచూచిన ప్రతివారూ చేయెత్తి నమస్కరించి, ఆదర్శవంతుడని చెప్పుకుంటారు. పూర్వం ఆతడెంత యోగ్యుడైతే మాత్రం, ఇప్పుడు లక్ష్మిదిక్కుకు మనస్సు పోతోంది. భార్య సరోజ కురూపియేమో వారికి అన్యోన్యంగా లేదేమో అని అనుకోటానికి అవకాశమేలేదు. నిజానికి లక్ష్మికంటే సరోజే జాస్తి రూపవతి. దాంపత్య విషయంలో ఆ కుటుంబాన్నే ఉదాహరణగా చెప్పుకుంటారు. ఆ వీధిలో ఆనందరావు యోగ్యుడే అయినా, లక్ష్మిమూలంగా తన జీవితానికి ఎలాంటి కళంకం రాబోతుందో అని క్షణక్షణానికి భీతిపడేవాడు. లోకులను నమ్మించి, తన నిర్దోషిత్వాన్ని ఋజువుచేసుకోలేకంటే, కోరవచ్చిన లక్ష్మికోరిక నెరవేర్చడమే అన్నివిధాలా శ్రేయస్కరంగా భావించి, తానీ నిర్ణయానికి రాగల్గాడు. ప్రతిఫలాపేక్షలేకుండా ఉపకారంచేసే మానవులు యీకాలంలో ఎవరుంటారు? తనకోసం నిరీక్షించడం తన స్వంతింటికంటే హెచ్చుగా ముక్కుమొగం తెలీని, పరాయివాళ్లు ప్రక్కయింట్లో ఉన్నంతమాత్రాన, వారి బాగోగులుగూర్చి సతమతమౌతూన్న లక్ష్మివిషయంలోకూడా అంతే అనుకున్నాడు ఆనందరావు. అందుచేత, అవకాశంపట్టి లక్ష్మి కోరికతీర్చి, ఆమెవల్ల రాదగిన అపాయం నుండి తప్పించుకోటంకంటె వేరు గత్యంతరం లేదు. యీ ప్రగాఢవిశ్వాసంతో రెండో కంటికి తెలీకుండా, సరోజను ఓ కొత్త చుట్టరికం కల్పించుకొని, కుశలప్రసంగానికై పంపేడు. ఒంట్లో బాగాలేదని, ఆ పూటకు వ్రాసిన శలవుకాగితం అప్పన్న తీసుకపోయాడు.

సరోజకు ఎప్పుడూ ఎక్కడకూ, లక్ష్మిని విడచి ఒంటరిగా వెళ్ళే అలవాటు లేదు. బావగారు ఆఫీసుకు పోయివుంటారనుకొని, అంతవరకూ బావగారి నిర్గమనంకోసం వీధి గుమ్మంలో నిరీక్షించిన లక్ష్మి సరోజకోసం ఇంట్లో ప్రవేశించింది. తలుపులన్నీ తీసేసివున్నాయి కాని, సరోజ అలికిడి యెక్కడా కన్పడలేదు.

"సరోజా" అంటూ పెద్దబొబ్బర్లు పెడుతోంది లక్ష్మి! సమాధానం విన్పడలేదు కాని, తూర్పువైపుగదిలో ఏదో సర్దుతూన్నట్లు శబ్దం వినపడింది.

"ఇక్కడుండే పలుకవేమమ్మా? నీ పలుకు బంగారంకానూ" అంటూ గదిలో ప్రవేశించడం ఆనందం గదిద్వారానికి అడ్డంపోయి నిలుచుకోనడం ఒక్కసారిగా జరిగాయి!

"ఏం మరదలా! సరోజకోసరం అంతకంగారెత్తుతావేం?" ప్రశ్నించాడు ఆనందరావు.

కాని, ఆనందరావుకు యెదురుగా నిలచి సమాధానం చెప్పడం అలవాటులేని లక్ష్మి, ఆనందంప్రశ్నతో ఉక్కిరిబిక్కిరి అయ్యింది.

మళ్లా ప్రశ్నించాడు "సరోజను అన్నావు కాని, నీ పలుకే బంగారంలావుంది. పాపం! అకస్మాత్తుగా సరోజ ప్రక్కవీధి చుట్టరికానికి పోయింది. నీగూర్చి ఎంతో కలవరించి, ఎప్పటికీ నీజాడ కన్పడకపోయేసరికి ఒంటరిగానైనా వెళ్లక తప్పింది కాదు. బహుశా ఆ సమయంలో నీవు ఆఫీసుకుపోయే బావగారిజాడకోసం కిటికీచువ్వలవద్ద నిమగ్నమై ఉండివుంటావు" అన్నాడు పరిహాసంచేస్తూ.

"సరోజ ప్రక్కవీధికి వెళుతుందని నాకు తెలియనే తెలియదే!" అంది లక్ష్మి తన కేదో లోపంజరిగినట్లు—


## కాస్టోలిన్

అన్నివిధములైన చర్మ వ్యాధులకు కాస్టోలిన్ ఒక సాటిలేని సంజీవి. దురద, కరప్పాన్, తామర, మేహవ్రణములు, మురికిపడలు, మానని కురుపులు, మొటిమలు, పిత్తపగుళ్ళు, అడుసుపుండ్లు, అన్నివిధముల గజ్జి, నారకురుపులు, కోతపడ్డ గాయములు, సోరపోవు చెడ్డకురుపులు మొదలగు వ్యాధులు మిగుల శీఘ్రముగా బాగుపరచును. డబ్బి 1-కి 8 అణాలు.

ధనలక్ష్మి అండ్ కో.,

సౌకారుపేట, మద్రాసు-1

"ఔను అదే నేనూ అంటున్నది. పోనీ సరోజ లేకపోతే నేనున్నానుకదా! కాలక్షేపానికి" అన్నాడు ఆనందం.

"క్షమించండి! కాస్త దారితప్పుకోండి" అంటూ ప్రాధేయపడుతూ అడిగినట్లయింది ఆనందానికి—

"లక్ష్మీ" అన్నాడు ఆనందరావు.

వంచినతల పైకెత్తలేదు లక్ష్మి.

"నీగూర్చి ఎన్నికలలు కంటున్నానో నీవు గుర్తించలేదేమో కాని, నాగూర్చి నీవు పడే ఆరాటం నాకు తెలుసు. చూడు...అనవసరంగా కాలం వ్యర్థంచేయడం నా తత్వానికి సరిపడదు" కాస్తంత సంశయంగానే అన్నట్టు వినిపించింది లక్ష్మికి.

"మీరు ఇలాటివారని నేనెప్పుడూ అనుకోలేదు."

"నిజమే లక్ష్మీ! చంద్రుడికైనా ఓ మచ్చ ఉందేమో కాని, నా జీవితానికి ఇంతవరకూ కళంకమంటూ లేదు ... కాని, నీ రాకపోకలు, నాగూర్చి నీవు తీసుకుంటున్న శ్రద్ధ ప్రతిదినం కిటికీచువ్వలమధ్య నిల్చొని నీవు నిరీక్షిస్తుండడం నన్ను నిజంగా పిచ్చివాణ్ణి చేసాయి...చాలాకాలం నీ మనఃప్రవృత్తిగూర్చి ఆలోచించాను. నాపై నీకు మమతలేకుంటే, నీ ప్రవర్తన వేరుగా ఉండి వుంటుందని ఒక నిర్ణయానికివచ్చి, యిప్పుడు నీకోసం ఏంచేయమన్నా సిద్ధపడుతున్నాను" అన్నాడు ఆనందం జంకుతూ సమాధానం కోసం నిరీక్షిస్తూ—

క్షమించాలి! మీరు యోగ్యులనీ, సోదరునికంటే హెచ్చుగారాబంతో ప్రేమిస్తారనీ, మీ మూలంగా సోదరులులేని కొరత నాకు తీరుతుందనీ, స్త్రీనవడంవల్ల కేవలం నిత్యవ్యవహారాల్లో కష్టసుఖాల్లో మంచిచెడ్డల్లో తోడు, నీడ అవసరం కనక, సరోజను "అక్కాయి"వరుసలో పిలుస్తున్నా కాని, వేరే దురుద్దేశంతో కాదు.

కన్పించిన ప్రతిస్త్రీని అనుభవించాలని వెర్రిఆలోచనలతో తలబ్రద్దలు చేస్తుంటాడు పురుషుడు. స్త్రీ నవ్వుకన్పడేసరికి తనమీద మోజుపడే చిరునవ్వులు చిలుకుతోందని భ్రమపడతాడు. ప్రమాదవశాత్తు స్త్రీ తనవైపు చూడడం తటస్థిస్తే తనకు వశమైనట్లే కలలు కంటాడు.

అసలు పురుషులకు, దయాధర్మాలు కాని, నీతి నియమాలు కాని, ఆత్మాభిమానాలు కాని ఉండవు.

మీయింట్లో చనువుగా తిరుగుతున్నంత మాత్రాన మీగూర్చి నిరీక్షిస్తున్నట్లు భావించి అవివాహితనైన నేను ఒంటరిగా దొరికేటట్లు కుట్రపన్ని యిప్పుడు నే లొంగకపోతే, బలవంతంగానైనా నాశీలం చెరిపి, మీ తుచ్ఛక్షణకాల సుఖంకోసం నా యావజ్జీవితం నాశనంచేసేటందుకు సిద్ధపడుతున్నారు.

ఆనందరావుగారూ! మీరు యోగ్యులని విన్నాను, ఉత్తములని భావించాను. హృదయం యిచ్చిపుచ్చుకొనగల వాత్సల్యం చూపుతారని భావించాను. అందుకే ఇంత చనువుగా మీయింట్లో మసులుతున్నాను. నేనెంత స్వేచ్ఛగా తిరుగాడుతున్నా, మీ గుణగణాల గుర్తించే మా తలిదండ్రులు అడ్డురాలేకపోయారు. నేను మీ యింటికి వస్తున్నది మిమ్మలను ప్రేమించికాదు. మీ దురుద్దేశాలకు నా శీలాన్ని బలియివ్వటానికి కాదు. క్షణకాలసుఖంకోసం, జీవితమంతా నాశనం చేసుకొని అఘోరించడానికీ కాదు...సరోజకోసం ఆమె గుణగణాల్ని ఆకళింపుచేసుకొని, స్త్రీ సంప్రదాయాల్ని నిలుపుకోనేందుకు, మీ అన్యోన్యదాంపత్యాన్ని అర్థంచేసుకొని, మా భావికుటుంబాన్ని ఒడుదుడుకులు లేకుండా నడుపుకోటానికి మాత్రమే ఉపకారంచేస్తున్నా, విషజంతువు స్వభావాన్ని విడువదని గుర్తించే, మీరు యింటికి రాగానే పారిపోయేదాన్ని. కిటికీచువ్వలవద్ద నిలుచొనివుండడం మీకై నిరీక్షించేందుకు కాదు — మీ నిర్గమనతిరోగమాలను గుర్తించడానికే మీరిచ్చినకానుకలు, మీపై వలపుచే స్వీకరించినవికావు. మా తండ్రిగారి అనుమతిమీదనే. మీరు నన్ను అపార్థంచేసుకున్నారు.

చనువుగా తిరిగి సంభాషించే ప్రతిస్త్రీ సరసాలకు లొంగిపోదని యిప్పటికైనా తెలుసుకోనండి. సమాజంలో మీకు ఎంత హక్కువుందో మాకూ అంత హక్కు వుంది. కథలు వ్రాస్తారు కవిత్వంచెబుతారు. ఎంతో జ్ఞానం సంపాదించారు. కాని ఏం లాభం. అనుభవం సంపాదించలేకపోయారు. నీతినియమాలను పాటించలేక ఆశయాలను, ఆదర్శాలను ఖూనీచేసుకుంటున్నారు. వ్యక్తుల మనస్తత్వాన్ని గుర్తించలేకపోతున్నారు.

దారితప్పుకోనండి. ఇంతవరకూ యోగ్యులని భావించి మీయింటికి పదేపదేసార్లు వస్తూపోతుండేదాన్ని. ఇప్పుడు మీయోగ్యత తెరవెనుక కుచ్ఛితమైన దురుద్దేశాలను చూసాను. సెలవు. మీ గుమ్మం ఇక యీ జన్మలో తొక్కడమంటూ వుండదు. ఎదుటివారిమనస్తత్వాన్ని గుర్తించి, మరీ ప్రవర్తించమని నా హితవు. అడ్డం లేవండి...ఇంకా అలా చూస్తారేం? అని గ్రుడ్లు ఉరిమి చూచే లక్ష్మిని చూచేసరికి, ఆనందరావు గజగజలాడిపోయాడు.

కొట్టొస్తుందేమో అన్నట్టుండే లక్ష్మి ఉగ్రస్వరూపం కన్పడేసరికి తనకు తెలీకుండానే కుర్చీవైపు కాళ్ళు దారితీసాయి.

"లక్ష్మీ వినరుగా పోతూంటే—లక్ష్మీ లక్ష్మీ చెల్లాయ్" అని ఒక్కమాటు అనగల్గాడు.

ఎదిరింటివారి రేడియోలోంచి "అదువారి మాటలకు అర్థాలు వేరులే" అన్నపాట వినవస్తూంటే — స్త్రీ మనస్తత్వాన్ని అర్థంచేసుకున్నవాడికిమల్లే కుర్చీలో చతికిలపడిపోయాడు.

